# మిఠాయి రాములు

'ఎన్నడు లేంది ఎక్కెక్కి ఏడుస్తుండు మిఠాయి రాములు 'అంట వార్తమానం దెచ్చింది పోలమ్మ. పోలమ్మ అంటె మాటలా ? చెవుల వడ్డమాటను వట్టుకోని పొల్లు వోకుండ ఏకెటందుకు కావల్శినంత ఊరిమీది ముచ్చెట్ల పత్తిని కూడ గొట్ట సత్తువున్న మనిషి. దానికి తోడు పోలమ్మ ఏకిన పత్తి ముల్లెను ఇప్పి ఏకులు పేనేటందుకు ఇరుగు పొరుగు లచ్చక్క, లింగక్కలు ఉండనే వుండిరి. వీళ్లకు తోడు ఆకుల రంగక్క గల్శింది అంటె అగ్గికి గాలి తోడైనట్లె. ఆవగింజంత మాటను వట్టుకోని ఆంజనేల తోకంత పొడుగు కట్టుకతలు అల్లుట్ల రంగక్కకు రంగక్కే సాటి. ఈ తల్లి బొంకుల రాట్నం బెట్టిందంటే ? ఇందాకటి ఏకులన్ని రాట్నానికి ఎక్కవల్శిందే . రంగక్క రాట్నం దిప్పు కుంట కతల దారం దీస్తుంటె ఆదారాన్ని బిండెలు జుట్టెటందుకు పొద్దెసాలదు. ఇనెటందుకు మందికి రొండు సెవులు జాలవ్.

పోంగ పోయి మిఠాయి రాముల జోలి రంగక్కరాట్నంల వడ్డది. ఇంగకత సుతారంగ సాగకపోతాది ? మీరే యినుండి.

మిఠాయి రాములు ఇప్పుడు గుసులూడిన మంచం కుక్కితీర్గ రెక్కలిర్గిన పిట్టోలె, బొక్కల పంజిరమోలె గానొస్తడు గని, వయిసున జూడాలె ఆ మొగతనపు సిరి మిర్ర. ఎత్తు బుజాలు కండలు దిర్గిన చేతులు, బూమినాదిచ్చే నడ్కతోటి తిర్గుతుండె. రాములు సూపుకే గాదు; పనిల గుడ అందరికన్న రొండాకులు ఎక్కువ చదివినోడె ! అంటె మిఠాయి జేస్కంల మంచి వొడ్పు నేర్పులు సంపాదిచ్చినోడు. నైకర్లు దొడ్గె కాణ్ణుండి పట్నం వొచ్చి చార్మినార కాడ బనారసీలాల్ హల్వాయిదుకాండ్ల జిలేబి తిప్పెటందుకు గుదిరిండు. ఇంతింత ఆపనిల మెలుకువలు దెల్సుకొని వేరే దుకాణం బెట్టు కుంటనన్నడు గని రాములు లేకుంటె హల్వాయి పని మూతవడెటట్లుగానొచ్చింది.

అది గాకుండ రాముల చేతి మహిమో ఏందో గని ఆయిన చేతి జిలేబి బాగ పొంగి లోన పాన్కం నిండి కరకర లాడుకుంట తిన్న కొద్దికి రుచి వూర్తది అంట మంది ఎగవడి

కొన్కా తింటరు. అందికె బనారసీలాల్ అడ్గినంత జీతం ఇచ్చి రాములను పోనియ్యకుండ ఆగ వట్టుకున్నడు. ఆకాణ్ణుండి రాములు మిఠాయి రాములైండు.

రాములు పట్నంల ఇట్ల పురపడ్డంక భూలచ్మిని పెండ్ల జేసుకున్నడు. భూలచ్మి గుడ రెక్కలు దాసుకునె మనిషి గాదు; ఇంట్ల ఇగురంగ కాపిరం జేసుకుంట రొండు పైసలు ఎన్కేస్కోని కాళ్ళకు కడాలు, చెవులకు గెంటీలు, మెడలకు జతగుండ్లు జేపిచ్చు కున్నది.

పెండ్లై ఐదేండ్లైన గుడ భూలచ్మికి పిల్లాజెల్లాగాలేదు. అదిజూసి అందరు పిల్లలు లేని బాగ్గెం ఎందుకవమ్మ ? ఇంటికి దీపం, నెత్తిన కొర్విబెట్టెటందుకు లేంది అంట తీరొక్క మాటలు, సూదుల్లోలె గుచ్చంగ మిఠాయి రాములు ముప్పై ఐదు ఏండ్లకు మళ్ళ పెండ్లి కొడుకై సుక్కమ్మ మెళ్ల పుస్తె గట్టిండు.

ఇప్పుడు మిఠాయి రాములు గంగమ్మ గౌరమ్మల నడుంగుల శివయ్యోలె ఇద్దరు పెండ్లాలకు మొగుడైండు. ఇద్దరు సముతులు అక్కా సెల్లె అనుకుంట కల్సి మెల్సి ఉంటుంటె మిఠాయి రాములకు పగలే ఎన్నెలగానొచ్చింది. రుక్కుణమ్మ సత్తెబామల నడ్మ కృష్ణమూర్తోలె నాట్కం ఆడుకుంట దినాలు గడ్ప వట్టిండు రాములు.

ఇట్లుండంగ ఎందుకో భూలచ్మికి నెల దాటింది, అన్నం యితవు దప్పి పుల్లటి వస్తువలు దిన బుద్ధి వుడ్తుండది. బియ్యం జేసేటప్పుడు మంటి పెళ్లలు గండ్ల వడ్తె ఏరి నోట్లేసుకుంటుండది. వోకారం రాంగ చింతకాయ తొక్కు సప్పరిచ్చి ముదుర్క పండు కుంటుండది. ఇదంత ఏందో పైత్యపు రోగం అనుకున్నడు రాములు. భూలచ్మిగుడ అయ్యో ! దేవుడు నాకేం కర్మ వెట్టె ? ఏం జేతు ? నాకు ఎన్కాముందు ఎవ్వరు లేక పోయిరి ఇదేం రుగ్మతనో ? అంట మిడుక్కుంట పెద్ద కాలేజిల సదువు జెప్పె గోపాల్‌రెడ్డి పెండ్లాం సుజాతమ్మ దగ్గెరికి వోయి

తల్లీ ! నాకెందో మాయరోగం వొచ్చినట్లుండది; పురాగ నిస్సత్తువవడ్డ. అంట కండ్ల నీళ్లు వెట్టుకున్నది. పాపం సుజాతమ్మ ఆరివారంగ దైర్నం జెప్పి ఆమె దోస్తు ఆడి డాక్టరమ్మ కాడ్కి తోల్క పోయి రోగపు లచ్చినాలన్ని జెప్పింది. ఆమె అన్ని పరీక్షలు జేసి నగుకుంట నీ కేం రోగం లేదు; ఇంగో ఆర్నెల్లకు కొడుకును ఎత్తుకుంటవ్ పో అన్నది. ఆ మాట ఇన్న లచ్మి ఆమె రొండు కాళ్లు వట్టుకోని -

తల్లీ ! డాక్టరమ్మ ! ముందే గొడ్డు దని నాబత్కు నగువాట్ల పాలైంది; మళ్ల యిప్పుడో కొత్త ఆశ జూపి , అది నిజం గాకుంటె నేను మొకాన మసివూసుకోని వురి ఏస్కోవాలె తల్లి ! తమరంటున్నది నిజంగనేనా ? అంట వొల వొల ఏడుస్తుండది.

అది జూసి సుజాత ' అయ్యో ! నీ ఎడ్డిర్కం పాడుగాను ! డాక్టరమ్మ, నీతోటి పరాశ్కం ఆడ్తదా ? నిజంగనె నీకు నెల దప్పింది. నీ రొట్టె ఇర్గి నేతిల వడ్డిది;పదా ఇంటికి అంట తోల్కపోయింది. ఈ సంగతి దెల్సిన రాములు ఆ రాత్రి తనింట్ల సిన్నపాటి దావతుగుడ జేసుకున్నడు. నెలలు నిండంగనె భూలచ్మి తల్లిగారింటికి వోయింది.

ఈనడుంగుల సుక్కమ్మ సుతారంగ నునుపెక్కింది; మిఠాయి రాంల కంటికి శక్కెర చిల్కోలె గానావట్టింది. సుక్కమ్మను ఎంట వెట్కుకోని రాములు సినిమకు గూడ పోయివస్తుండడు. సుక్కి శికెముడ్వకుండ పక్క పాపెట దీసి జెడేస్కం నేర్పింది. అది జూసి రాములకు పొద్దావూపు దెల్వకుండైంది. ఇట్ల వో రొన్నెల్లు గడ్సెట్యాళ్లకు సుక్కమ్మకూ చింతకాయలు, మాడికాయలు తినబుద్దైంది. ఇది తెల్సు కోని మిఠాయి రాంలు ఇంగింత ఎదలు ఇర్సి తిర్గవట్టిండు. మొగతనం అంత తన ముంగిట్ల మొల్సినట్ల !

భూలచ్మికి ఆడివిల్ల వుట్టింది; పిల్లకు మూణ్నెల్ల సందున పట్నం వొచ్చింది భూలచ్మి. బూలచ్మి యింటికి రాంగనె సుక్కమ్మ నిండుమణిషై నీళ్లాట కని తల్లి గారింటికి పయినం గట్టింది.

ఇట్ల భూలచ్మి సుక్కమ్మ లిద్దరు పోటీలు వడ్డట్ల, షెర్తులు గట్టుకున్నట్ల ఒగరి ఎంట ఒగరు అంట మిఠాయి రాములుకు నలుబై ఐదేండ్లొచ్చెవరకు సుక్కమ్మ ఇద్దరు కొడుకులూ వో ఆడి విల్లనూ భూలచ్మి ఇద్దరు ఆడివిల్లలనూ గన్నరు.

ఇంతింత పిల్లలు పెద్దైన కొద్ది నీవూ నేనంట సముతులల్ల రవరవలు పెరిగినవి. అక్క సెల్లెండ్లోలె కల్మిడిగ (ప్రాణవార్తికం తోటి వుంటున్న భూలచ్మి సుక్కమ్మలకు వోర్వ లేని తనం వొచ్చి ఒగరికి వొగరు ఎడమొకం పెడమొకం ఐన్రు.

ఈ జగుడాలు మాన్పలేక రాములు కల్లు సీసల శరణు జొచ్చిండు. అది సాలదన్నట్ల పొట్లాలకు మరిగిండు. సూస్తుండంగనె రాములు అరువయ్యో పడిన వడ్డడు. జవసత్వాలు ఉడ్గ వట్టినయ్. పెండ్లాలు సంపాయించిన సొమ్ము ఎవర్ది వాళ్ల

ఏరే బద్దురం జేస్కోవట్టిన్రు. రాంలు దెచ్చిన జీతం వోనెం వో పెండ్లం సేతుల ఇంగోనెం ఇంగో పెండ్లం సేతుల వోసే కట్టడి గుదిరింది.

ఈ దినాలల్లనె గోపాల్ రెడ్డి పెద్ద బంగుల గొన్నడు. ఆ ఇంటికి ఎన్కాముంగుల ఖాళి సోటు బాగనె వుండది. పక్క పొంటి మోటారుఖాన గుడవుండది. ఇంటి ఎదురుగ తీరు తీరు పూల చెట్లు, మల్లెపొదులూ వుండవి, ఇంగ వాటికి నీళ్లువొయ్యనీకె, ఇంటికి చౌకిదారు తీర్గ పని జేసెటందుకు మనిషి గావల్సి వొచ్చింది. అసొంటి యాళ్ల మిఠాయి రాములు గోపాల్ రెడ్డి గూజాల పెండ్లాలు పిల్లల తోటి వొచ్చి దిగిండు. ఈ పొందికె అందరికి మెప్పితమైంది.

సుజాతమ్మ బంతి పూవొన్నెతోటి సుకుమారంగ గానొస్తది. మాట శనా నిదానం గని నిర్ణాయకంల మట్టుకు ఇగలేని బిరుసూ గడుసు. ఆమె ఎప్పుడు దూరపు ఆలోచనే జేస్తది. ఆ దూరపు సూపు తోటే రాంలను పిల్సి ' సూడురాంలు ఇప్పుడెట్లా ఎవ్వరికి వాళ్ల వేరే సంసారం నడ్పుతున్నట్లె వుండది, ఆసొంటప్పుడు ఈ మోటారు ఖాన నడుంగుల వోసన్న పాటి పర్ద గోడ పెట్టు, ఎవరి సెంబు తప్పాల వాళ్ళు దీస్కోని కుండేరు వడి కాపిరం జేస్తరు. నీవు వోనెం సుక్కమ్మ, వోనెల భూలచ్మి తావ వుండు అంట సలా జెప్పింది. ఇది ఇని అందరు సుజాతమ్మ బుద్దిని వొగిడిన్రు. గోపాల్‌రెడ్డి గుడ సుజాతమ్మ తీర్పును మెచ్చుకున్నట్ల కండ్లతోటే నగిండు. ఇట్ల గోపాల్‌రెడ్డి ఇంట్ల వంట పని ఇంటి పని జేస్కుంట ఆ కుటింబంల ఇంటోళ్ల తీర్గనే మెస్ల వట్టిన్రు.

మిఠాయి రాములు తన కాళ్ల జేతులు సల్లగుండంగనె ఇద్దరాడివిల్లలకు పెండ్లి జేసిండు. దీంతోటి బనారసీలాల్ ఇన్నొండ్లు తనకు మిఠాయి జేసి బేపారం వృద్దిలకు దెచ్చినందుకు ప్రతిపలంగ ఇచ్చిన ఇర్వైవేల రూపాలు వొడ్సినయి. అయితేంది ?, ఆడివిల్లలు మంచి యింటికే వడ్డరు గని రాములె పాపం కోరలు పీకిన ముసలి పామోలె ఐండు.

భూలచ్మి గోపాల్‌రెడ్డికాడ్కి వొచ్చి బిడ్డకు మంచి సమందం గుదిరింది యాదన్న సాయం జేయాలంట అడ్గింది; సుజాతమ్మ గోపాలయ్య గల్సి ఆలోచన జేసి ఒక్క కుత్కెతోటి ' చూడు లచ్మి, పైకం నీ సేతి కియ్యం, మెళ్ల తులంబంగారం, పిలగానికి అద్దతులం బటువు, బిందె, సెంబు, బకీటు, బొట్టుపెట్టె, ఐదువేలరోపాల బట్టలు, బోజినం కర్సు అయిదు అంత గల్సి ఇరువై దాంక వెడ్తం. దమ్మిడి అటిటు గాకుండ

లెక్కజూసాలె అన్నరు, భూలచ్మి సంతోసం బట్టలేక మళ్ల వాం వాం ఏడ్సింది. మీరే తలి దండ్రి అంట మొక్కింది.

ఆనెల రాంలకు సుక్కమ్మ ఇంటి బోజినం లెక్క గని పెండ్లి పపోజినం గన్క బూలచ్మి ఇంట్లనె వున్నడు, సుక్కమ్మ, సుట్టాలు అందరొచ్చి ఆపనీ ఈ పని అందుకో వట్టిన్రు. పెండ్లి మోతెబరి రకంల హాలు కిరాయికి దీస్కోని జరిపిచ్చిన్రు. రాంలు పెద్ద వణిసి తరీఖలనె అంచుదోతి, ఎర్ర రువమాలు గట్టి పెద్దదావతు, సిన్నదావతు, సత్తెనారాయణ కత అన్ని నడ్పి పెద్దిర్కం నిల వెట్టుకున్నడు. పదారోపండుగ నాడు బియ్యపు అట్లు వోస్కోని పందిరి కొమ్మలాంచి వంగ దించుకున్నరు. ఎక్కడోళ్లు అక్కడ వోయిన్రు. పిల్ల అత్తగారింటికి వోయింది. ఆనాటితోటి నెల గడ్సింది. అద్దం దీసిన తడ్కను మళ్ల వూనిచ్చిన్రు. ఒక్క ఇల్లు రొండైంది.

లచ్మీ ! యింగా బువ్వవెట్ట వేమే అన్నడు రాములు. విన్నటికే నెలదీరి పాయెగద ! పో నీ సిన్న సుక్కకాడికి నోరు దెర్సి అడ్గినందుకు విన్నటి కూడు ఆ గిన్నెల ఉండది తినిపో అన్నది, వొంటి తనం యాది కొచ్చి బయమైంది.

మొక మంత సిన్న జేస్కోని రాంలు కట్టె వట్టుకోని సుక్కమ్మ ఇంట్లకు ' దూపై తుండదే వో ఐదు రూపాలియ్యి, రాత్రికి బువ్వదినను ' అన్నడు. ఆమాట యిన్న సుక్క దీరాలు దీస్కుంట నాపాల వడ్డ నెల విన్ననె దీరి పాయెగద, ఈ నెల నావొంతు ఎందుకైతది ? నీ లచ్మికాడ్కెపో ఆ నెల నేను వెట్టనన్ననా ? పబ్బమంటవోతివి, పబ్బం గడ్పుకోని మళ్ల ఏం మొకం బెట్టుకొచ్చినవ్ ' పో అన్నది.

మళ్ల లచ్మి కాడ్కవోతె ' నెలనాళ్లు దొరోలె గూసుండి దినాం సియ్యబువ్వదిను కుంట ఎమిజాలి దాగితివి అది జాలదన్నట్లు మళ్ల ఈడి కొస్తె నే నెట్ల నడ్పుత అంట ఈ పడిచ్చు కుంట దుల్పరిచ్చింది.

ఆమాటలిన్నంక రాములు బతికి సచ్చిన బాబతు ఐతిగదా? అంట గోపాల్‌రెడ్డి ఇంటెన్క సపారంల గూలవడి నెత్తిన సేతులు వెట్టుకోని కూసున్నడు.

ఈ రూపకంల రాములను జూసింది పోలమ్మ, రంగక్కకు పెండ్లి కాణ్నుండె రాంల మీద కోపం గొంతు మట్టం నించుకున్నది. ఎందుకంటె మొన్న పెండ్లిల్ల బంతిల గూసోవెట్టి అందరి తీర్గ తనకూ వో రెండు పోలెలే ఏసిన్రు గని, తినే రంగక్క అంట

వోలడ్డన్ను గట్టిచ్చిండా ఇంటికి? బాగైంది శాస్తి. దేవుడు ఎక్కడ జూస్తడు ఆనాడే ముద్దుగ నన్ను జేస్కుంటె పూలల్ల వెట్టి సాకుతుంటి గద. ఈనాడు అడ్కలినె గాచారం బట్టకుండె గద ! అంట కతను కైతలల్లి తూర్పార వట్టి తన కసి ఎళ్ల వోసుకున్నది.

ఇట్ల తన రూపునూ పనితనాన్ని జూసి వలిసిన ఆడిదే తనను అడ్డం బడంగనె ఎత్తి పాడిసింది. ఎత్తువడ్డ గొడ్డు మీద నాల్గు రాళ్లేసింది.

వయసున ఎగిసి పడ్డ రాములు ఈనాడు ఎందుకు పనికిరాని సిల్లివోయిన పాత బొక్కనోలె, కొరగాని వొంటి చెప్పోలె, బిసదప్పిన మిషనోలె, పనికిరాని పనిముట్టోలె ఇంటెన్క కూలవడ్డ రాములను, జూసి, సేసేత జేస్కున్న ఆగతి జూసి, గోపాల్‌రెడ్డికి, ఏమని పిచ్చిందో ఏమొ దగ్గరికి వోయి ' రాములు ! గీడ గూసున్నవ్ ? లోపటికిరా చాదాగుదువు' అంట విల్సుకొచ్చి తానే చాకోపు చేతి కందిచ్చుండు. రాములకు దుక్కం ఇంగింత పొర్లుకొచ్చింది.

' కాలం గల్సిరానప్పుడు మనిషి, మనిషి చేతులనె కీలుబొమ్మ ఐతడు ' అంట అంటున్న గోపాల్‌రెడ్డిని జూసి సుజాతమ్మ ' ఆఁ సేజేతుల జేస్కోని కాలాన్ని అనుడెందుకు ? ''కండ బలం వున్ననాడు హీరగ ఎగిరిపడక నెత్తాంచి నడువాలె '' అన్నది. ఇదంత ఇని సుక్కమ్మ, బూలచ్మి ఇద్దరు వుర్కొచ్చి నడువ్ అంట ఇంట్లకు లేప్కపోయిన్రు. రొండిండ్లు వొకటైనవి.